# గరళ జీవులు

"ఆకాశవాణి.... ....ఒక ముఖ్య ప్రకటన........"

ఎంచేతో ఆ ఒక్కముక్కా, రాఘవులును నిటారుగా కూర్చునేలా చేసింది. పంచేంద్రియాలూ రేడియో మీద కేంద్రీకృతమై పోయాయి మరుక్షణంలో.

అనౌన్సరు గొంతుక స్పష్టంగా పలుకుతోంది....

"....ప్రకాశం జిల్లా........రావినూతలపాడు నుంచి.... శేషాద్రి గారు....తమ కుమార్తె శేషుమణి గత వారం రోజులుగా కనిపించటం లేదని తెలియజేస్తున్నారు. అమ్మాయి వయసు పదహారేళ్ళు. నాలుగడుగులా పదకొండు అంగుళాల పొడవూ, తగిన లావూ చామనఛాయ రంగూ....ఎడమ కంటి క్రింద కందిగింజంత పుట్టుమచ్చ....శివరాత్రి సందర్భంగా ఒంగోలుకు సినిమాలకోసం స్నేహితురాళ్ళతో కలసి వెళ్ళిందిట....తిరిగి వచ్చేటప్పుడు లేదని తెలిసిందట....థర్డ్ ఫారమ్ వరకు చదువుకుంది....ఇంగ్లీషు షుమారుగా వచ్చును....జాడ తెలిపినవారికి మంచి బహుమతి ఇవ్వబడుతుంది....ఆచూకి తెలిసినవారు ఈ అడ్రసుకు తెలియ జేయాల్సిందని శేషాద్రి గారు....కోరుతున్నారు...."

రాఘవులు శరీరం ఒక్కసారిగా రోమాంచిత మయింది....వెన్నుమీద పాము పాకినట్లు, జలదరింపూ, వెర్రి భయమూ ఒక్కసారిగా చుట్టు ముట్టాయి....

శేషుమణి.... శేషుమణి....ఎవరో ఆ అభాగ్యకన్య....

సుబ్బులు....సుబ్బులు....తనకూతురు....అదేవయసు...
ఇంచు మించు అలాగే వుంటుంది....షిప్త్ఫారం చదువు
తోంది....వారంరోజులుగా కనిపించటంలేదు....బంధువు లంద
రికీ ఉత్తరాలు వ్రాసేసాడీరోజే....

"మరో ప్రకటన...." అనౌన్సరు గొంతు ఖంగుమంది
మరోసారి.

" ఈ దారుణమైన.... ఈ కిరాతకమైన.... ఊహూఁ
నే వినలేను........"గబగబా, కూర్చునివున్న వరండాలోనుంచి
లేచి' పక్కగదిలో అరుస్తున్న రేడియో దగ్గరకు పరుగెత్తి
ఠక్కున దాని గొంతుక నొక్కేశాడు....

"కొంపదీసి నా సుబ్బులు....బలవంతగా...." ఇక
ఆలోచన సాగలేదు. తలమీద ఎవరో బలంగా సమ్మెటతో
కొడుతున్నట్లు బాధ....

"రాఘవులూ!" గర్జనలాటి పిలుపు....

రోజూలా ఆ పిలుపు వెనకాలే పరుగు తీయలేదు.
కాళ్ళాడ లేదు.

"రాఘవులూ!" తిరిగి అదేగర్జన.

తప్పని సరిగా అడుగులు అటుకేసి పడ్డాయి. ఎత్తైన
మేడ అది. క్రింద భాగంలో చాలాగదులు ఇరుకు ఇరుకుగా;
మొదటి అంతస్తులో ఈ పెద్దవరండా, వరుసగా పది విశాలమైన
గదులు....పై అంతస్తులో ఇలాగే వరండా, విశాలమైన
గదులూ, చాలా ఖరీదైన ఫర్నీచర్‌తో....ఖరీదుగల వారి
కోసం మాత్రమే కేటాయింపబడినట్లు.... అందంగా వున్నాయి.

వరండా చివరగావున్న "బాస్" గది....అది ఈరోజెందుకో చిరుతపులి బోనులా కనిపించింది రాఘవులుకు....

"ఏమిటి రాఘవులూ, పగలే ఓడ్కోసు వేసుకున్నావా? లేక నిద్రపోతున్నావా?" పెద్ద సోఫాలో నల్లని ఫుల్‌సూట్‌లో ఖడ్గమృగంలా వున్న రాజారావు విషపునవ్వు నవ్వుతూ అడుగుతున్నాడు. అతగాణ్ణి పరిశీలనగా చూశాడు రాఘవులు....గత ఐదారేళ్ళుగా ఎప్పుడూ అలా చూడలేదు. మొండి వ్రేళ్లు కనిపించకుండా, యూరోపియన్ స్టయిల్‌లో చేతులకు రెంటికీ "గ్లోవ్స్" తొడుక్కుని వున్నాడు. ఓ అమెరికన్ డాక్టర్ పుణ్యమా అని మొదటి ప్రయోగంగా.... ....ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్న ముక్కు....కొద్దిగా కొరుక్కుతిన్న చెవులూ, లోతైన ఊబిగుంటల్లో, మిణుగు పురుగుల్లా మెరిసే, గుంట కళ్ళూ, క్రూరమైన చూపులూ....రాజిగాడు....కాదుకాదు....రాజారావు....తన శరీరంలోని ఆ భయంకర వ్యాధిని మరుగు పరుచుకోవాలని ఎంతగా ఆరాట పడుతున్నాడో....పరాయివారి....అందునా స్త్రీల శరీరాలతో....ఎంతలా చెలగాట మాడుతున్నాడో.... ఈ విషప్పురుగు నీడలో....తనెలా తలదాచుకున్నాడు ఇన్నాళ్లూ.... ?

"ఏమిటి రాఘవులూ! ఈరోజేమిటో కొత్తగా కనిపిస్తున్నావు....కొంపదీసి ఆ కొత్తపిల్ల మీద మనసైందేమిటి? వెకిలిగా నవ్వుతూంటే, బొజ్జంతా కదిలిపోయింది!

"..........."

"వాళ్ళమ్మాయి.... వారం రోజులుగా కనిపించటం లేదట సార్. బెంగెట్టుకున్నాడు...." రాజారావుకు కాస్తంత

ద్వారంలో నిల్చుని వున్న చలపతి సమాధానం చెప్పాడు.

"ఎన్నేళ్ళ పిల్ల? పెద్దదేనా? బాపుంటుందా? చివరి ప్రశ్న వేసి, రాఘవులు వేపుచూచి, అతని కళ్ళలో కనిపించిన రోషం చూచి....తనను తను కంట్రోల్ చేసుకున్నాడు రాజారావు....

"పెద్దపిల్లేనండి .... చదువుకుంటున్నది...." చలపతే సమాధానం చెప్పాడు తిరిగి.

"పాపం! ఎటుపోయిందో ఏమిటో.... ఈ మాట చెప్పావుకావేం రాఘవులూ.... ఈ పూట కాస్తంత డ్యూటీ వుంది నీకు.... అదికాస్త అయ్యాక.... శలవు తీసుకో. పిల్లని వెతుక్కో. రెండురోజులుశలవు పెట్టినా ఫర్వాలేదులే....కానీ ముందస్తుగా.... ఈ కొత్తపిల్ల సంగతేమిటో చూడు.... నీకు తప్ప సాధ్యమయ్యేలా లేదు వ్యవహారం....

ఆపెద్దగదిని రెండుగా చీల్చుతున్నట్లు మధ్యగా నల్లని తెర.... తెర వెనుక కొత్త భాగోతం!

"మరి నేవెళ్ళొస్తా. పిప్పులో వచ్చే దొరలు.... మరి

మనల్ని వదల కూడదు .... మంచి హైక్లాసు అమ్మాయి....కాస్తనువ్వు రంగంలోకి దిగితేగానీ దారికి వచ్చేలా లేదు....నీయిష్టం....నేవస్తా...." తన చేతిలో వున్న "హంటర్" రాఘవులు చేతికిచ్చి....గదిబయటకు నడిచాడు రాజారావు....చలపతికూడా అనుసరించాడు....

రాఘవులు చేతిలోని హంటర్ బిగుసుకు పోయింది.... అనాలోచితంగానే తెర వెనక్కు నడిచాడు....

చాపమీద మోకాళ్ళమధ్య తల పెట్టుక కూర్చుని వుందా అమ్మాయి.... కాస్తంత దూరంలో దుర్గవ్వ కూర్చుని వుంది.... పక్కగానే పాలగ్లాసుతో....

"రా! రా! రాఘవులూ! అయ్యగారు యిలా ఎంతగా నయానా, భయానా చెప్పినా వినటంలే! రెండురోజులుగా అన్నం నీళ్లు ముట్టడంలేదు....ఈ గ్లాసెడు పాలు తాగించ లేక పోతున్నాను పొద్దున్నుంచీ! అదృష్టం అందలం ఎక్కిస్తా నంటే, బుద్ధి బురదగుంటలోకి లాగిందట! నీచేతి దెబ్బరుచి చూసే యోగం రాసిపెట్టి వుంది మరి...." అంది గారపట్టిన పళ్ళు బయట పడేలా వికృతంగా.... దయ్యంలా నవ్వుతూ! తట్టంత జుట్టుముడి- మరోమారు ఝాడించి వేసుకుంది.

చివ్వున తలెత్తిందా అమ్మాయి! ఎదురుగా కండలు తిరిగిన....రాక్షసుడిలాంటి రాఘవుల్ని చూచి, అతడి చేతి లోని హంటర్ చూచి....గడగడ లాడుతూ....చప్పున లేచి నించుంది....

"ఒక ముఖ్య ప్రకటన.... శేషుమణి.... ' ఠక్కు' మని మారుమ్రోగింది లోలోపల రాఘవులుకు.... శేషు మణి కాదీ అమ్మాయి.... చాలా అందంగా వుంది.... బంగారు తీవెలా వుంది....ఎవరో కలవారమ్మాయి. ఎలా కాలుజారిందో.... ఏ బలవత్తర శక్తుల ప్రేరేపణవల్లో .... యిల్లు వదలి....దుర్గవ్వ గాలంలో ఎలా చిక్కుకుందో.... ఈ విషవలయంలోకి ఎలా ఈడ్చుకు రాబడిందో....

సుబ్బులు....తన సుబ్బులుకూడా ఇలాగే....

మెదడు మొద్దుబారి పోయిందొక్కసారిగా .... తన మీద తనకే కసిగా .... చెయ్యి ఛెళ్ళున కొరడా నేలమీద బాదింది. కెవ్వున అరిచిందా అమ్మాయి.... .... దుర్గవ్వ.... రోకలిబండల్లాటి చేతులతో ఆ పిల్లని గట్టిగా పట్టుకుంది.... "ఎక్కడికీ పారిపోలేవు.... చూశావుగా రాఘవుల్ని ? వాడికి తిక్క రేగిందంటే చీరి పారేస్తాడు.... తిన్నగా మాటవిని.... ఒళ్ళు పాడుచేసుకోకు వాతలు తేలేలా ! పాలుతాగీ, తిండి తినీ.... షోకుచేసుకోనీ.... రాఘవులు శరీరానికి చెమటపడుతోంది సుబ్బులు.... సుబ్బులు.... అమాయకంగా ఆడుతూ పాడుతూ స్కూలుకు వెళ్ళే సుబ్బులు.... ఇప్పుడెక్కడుందో ? చదివించి పంతులమ్మను చెయ్యాలనుకున్నాడు తను. ఏ కిరాతకుల చేతుల్లో....మళ్ళీ ఛెళ్ళుమంది కొరడా నేలమీద !

ఈ సారి ఆ అమ్మాయి కెవ్వుమన లేదు.... జీవచ్ఛవంలా నిల్చుండి పోయింది.... బిగుసుకున్నట్లు— "మాట విను"....అన్యాయంగా చస్తావు ... ఓ సారి ఇలాగే మాట వినని పిల్లను ఎత్తికుదేశాడు రాఘవులు....ఇక జన్మలో నడవలేక.... ఇప్పుడు అడుక్కు తింటోంది వీధులంట...."

"దుర్గవ్వా ! నువ్వుబయటకు వెళ్ళు !" రాఘవులు సింహంలా గర్జించాడు.... అతగాడికి ఆ అమ్మాయిని కొట్టే "మూడ్" వచ్చిందనిపించింది దుర్గవ్వకు. మెల్లిగా తెరకాస్త తొలగించుక గది బయటకు వెళ్ళిపోయింది..... క్షణకాలం భయంకరమైన నిశ్శబ్దం. . . సూది క్రిందబడ్డా ఇద్దరిగుండెలూ బ్రద్దలైపోయేంతటి నిశ్శబ్దం.....

జాలినిండిన రాతిగుండెతో....ఒక్కడుగు ముందుకు వేశాడు రాఘవులు....

మొదలు నరికిన చెట్టులా....ఒక్కసారిగా వచ్చి కాళ్లకు చుట్టుకుంది, ఆగని వెక్కిళ్లతో....

"నీకు మొక్కుతాని....నీ బిడ్డలాటిదాన్ని....మా అమ్మా నాన్నా మొన్నటివరకూ వెన్నా, మీగడతో గోరుముద్దలు తినిపించారు....ఒళ్ళు కొవ్వెక్కి....ఓ వెధవని నమ్ముకుని....స్వర్గంలాంటి ఇంటినుంచి బయటికొచ్చాను....వాడు వెళ్ళిపోయాడు....ఇది .... ఆభూతం .... నమ్మించి .... ఉద్యోగ మిప్పిస్తానని—ఇక్కడికి తీసుకొచ్చింది. నిజం....నా మాటనమ్ము. నే నలాటిదాన్ని కాదు....నన్నుకొట్టొద్దు మా అమ్మానాన్నల దగ్గరికి పోతాను....మరెప్పుడూ బయటికిరాను. నన్నుకొట్టొద్దు....నీ బిడ్డలాటిదాన్ని....

రాఘవులు గుండెలు బ్రద్దలయ్యేలా వున్నాయి....అప్రయత్నంగా....ఎవరినో చావబాదిన చెయ్యి, ఎందరు కన్యలనో అవలీలగా ఎత్తిగాలిలో గిరగిర తిప్పిన చెయ్యి....ఎందరి జీవితాలనో—ఈ విషపు ఊబిలోకి గిరవాటు వేసిన చెయ్యి.... "నీ బిడ్డలాటిదాన్ని....సుబ్బులు....సుబ్బులు,." అన్న మాటలా ధ్వనించటంతో....ఆ అమ్మాయి తలమీద సుతారంగా నిమరసాగింది....భాషాతీతమైన వాత్సల్యం.... "అవును నాబిడ్డవే నువ్వు...."నిన్ను కొట్టను....నిన్ని వలయంలోకి త్రోయను...." మనసులో అనుకుంటున్న మాటలు....పైకివచ్చేలోగా....

"రాఘవులూ!" అన్న పిలుపు.... కాదు గర్జన.... ఒక్కసారిగా కొయ్యబారిపోయాడు రాఘవులు. రాజారావు వచ్చేశాడు! తనఆలోచనలతీరు ఏ మాత్రం పసిగట్టినా.... వేటకుక్క— తనూ.... ఈ పిల్లా.... ఆనవాలుచిక్కరు. మరుక్షణంలో కర్తవ్యం స్ఫురించింది....

విసురుగా వెనక్కితోసేశాడు ఆ అమ్మాయిని.... కొరడా నేలమీాద ఛెళ్ళుమంది....

"ఏం రాఘవులూ....పిల్ల పైత్యంవదిలిందా?" రాజారావు తెరదాటి వచ్చాడు పిచ్చిగా నవ్వుతూ ....పిశాచాల మధ్యపిల్లి లా గజగజలాడి పోతోందా అమ్మాయి....

"....పదండి మీాతో కాస్త మాట్లాడాలి...."ఓవిధంగా త్రోసుకు వచ్చాడు బయటికి....కుతూహలంగా చూశాడు రాజారావు.

"అయ్య నింటిపిల్ల .... అబ్బురంగా పెరిగినదానిలా వుంది. దుర్గవ్వ మోటుదనానికి హడలిపోయిందల్లేవుంది. నాజూకైన అందం. దెబ్బలతో నాశనం చేయటం నాకిష్టంలేదు....కాస్త నయాన ఒప్పిస్తే .... మంచి లాభం .... ఏమంటారు .... రాఘవులు చెప్పటం ఆపాడు.

క్షణకాలం ఇబ్బందిగా.... బోనులోని చిరుతపులిలా అటూ ఇటూ తిరిగాడు రాజారావు.

"నీ యిష్టం.... కానీ.... ఆలస్యంచేయకు.... మంచి సీజన్ రోజులివి.... ఒక్కొక్కరోజు వృథాపోతే.... ఒక్క వెయ్యినష్టపోతాం.... తెలుసా?

రాఘవులు తెలుసన్నట్లు తలూపాడు.

"కంపెనీ కారు తీసికెళతాను!" అన్నాడు మళ్ళీ .....

"అలాగే!" రాజారావు వరండాలోకి వెళ్ళిపోయాడు.

"దుర్గవ్వా! ఒక్కగంటలో వచ్చేస్తాను. ఆ అమ్మాయిని రెడీగావుంచు.... అట్లా కారులో తీసికెళతాను" అన్నాడు రాఘవులు హుషారుగా వరండా చివరలో కూర్చునివున్న దుర్గవ్వతో. దుర్గవ్వ తలూపింది పిశాచంలా.

రెండేసి మెట్లచొప్పున గెంతుతూకిందికివచ్చి, వీధిలోకి వచ్చాడు రాఘవులు. అతగాడి హృదయంలో ఏదో ఆనందము....ఎప్పుడూ కలగనంతటిహాయి ఏదో అవ్యక్తంగా చోటుచేసుకొంటోంది.... ఈ పిల్లని........మెల్లిగా తప్పించ గలిగితే? మరుక్షణంలో సుబ్బులు గుర్తుకు వచ్చింది.... మెరుపు కొట్టినట్లు మనసు క్షణకాలం మండిపోయింది....

ఈనాడు.... కేవలం ఆ కొత్తమ్మాయి మొహంలోని జాలీ—అమాయకత్వం తనలో ఈ జాలిని రేపాయా? లేదు లేదు—తన సుబ్బులు....తనబిడ్డ.... కనిపించకపోవటంతో ఏదో భయం తన పాపాల తాలూకు భయం ఈ ఆత్మవిమర్శను రేపుతోంది అసలు తనీ ఊబిలో దిగవలసినదికాదు. గరళంలోనూ కొన్ని క్రిములు బ్రతికివుంటాయట! ఆ విషాన్ని తింటూ, ఆ విషయవాయువులను పీలుస్తూ అవి వృద్ధి అవుతుంటాయట....అలాగే తనూ ఈ విషంలో విషక్రిమిలా బ్రతుకుతున్నాడు అసలిదంతా ఎలా జరిగింది?

* * *

తాతాతండ్రుల నాటినుంచి వస్తున్న కుమ్మరి వృత్తి అంటే రాఘవులుకు ఏనాడూ ఇష్టంలేదు సరికదా, తండ్రి చక్రం తిప్పమన్నా, కుండలు చెయ్యమన్నా, ఆము తొక్క మన్నా, ఇంతెత్తున ఎగిరిపడేవాడు; "వెధవపని! మట్టిమసీ పూసుకుని దసరా వేషగాళ్ళలా కడుపు నిండుతోందా? కాలు నిలదొక్కుకో గలుగుతున్నామా? ఆచాకలివాళ్ళ నారిగాడు చూడు ఎస్సెల్సీ పాసయ్యాడు. దర్జాగా వుద్యోగంచేస్తూ, నూర్రూపాయలు తెస్తున్నాడు నెలకు! నేనూ అట్లాగే చదువుకుంటాను పెద్ద వుద్యోగం చేస్తాను. కావలసి నంత డబ్బు సంపాదిస్తాను. అంతేగానీ, ఈ పల్లెటూళ్ళో, ఈ ఆసాములకు కుండలూ, కుడితితొట్లూ, మూకుళ్లూ, గరి సెలూ చేస్తూ—వాళ్లుపెట్టే "మేర" గింజలకోసం పడిగాపులు పడివుండటం నావల్ల కాదు!" అంటూ తెగేసి చెప్పేశాడో రోజు

రాఘవులు తండ్రి లక్ష్మయ్య చాలా నొచ్చుకున్నాడు. రాఘవులు స్కూల్ఫైనల్ రెండుమార్లు దండయాత్ర చేసి మూడోసారికి సిద్ధమౌతున్న సమయానికి—దేశానికి స్వాగతం త్ర్యం వచ్చి పదేళ్ళుదాటింది! మహాత్ముని బోధలు తిన్నగా ఉపన్యాసాలలోకి "కొటేషన్స్" లా వాడుకోవటం ప్రారం భమయింది! ఆ మహనీయుడు చెప్పిన "వృత్తివిద్యల" కు మంగళగీతం పాడటమూ, కొత్త "విద్య" లకు ప్రయోగాల ప్రారంభమూ ఏకకాలంలో జరిగిపోయాయి....స్కూలు ఫైనల్ ఎస్.ఎస్.ఎల్.సి వగైరా పేరు మారి టెన్త్ క్లాస్, సెవెన్త్ఫారమ్....పి.యు.సి.....ఇంటర్మీడియెట్

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL, GUNTUR.

మూడేళ్ళ డిగ్రీకోర్సు, ప్రాంతీయభాషలో బోధనాపద్ధతి ఇంగ్లీషు కావాలి...ఇంగ్లీషు వద్దు.... ఇలా నాలుగు స్తంభాల ఆట ప్రారంభమైంది. ఈ ఆటలో ఒక్కో సంవత్సరంలో ఒక్కో రకం విద్యాబోధన...ఒక్కొక్క క్రొత్త ప్రయోగం....అది ఎగతాళిపాలైతే మరోటి....ఇలా దేశం ప్రయోగశాలగా, దేశంలో విద్యార్థులు ప్రయోగసాధనాలుగా మారిపోయారు.

కమిటీలమీద కమిటీలు పెరిగాయి. కరువు పెరిగింది నివేదికలమీద నివేదికలు తయారయ్యాయి.... నిరుద్యోగం ప్రబలింది.

రైతూ,కూలీ అంతా చదువుకున్నవారే! ఆడ, మగ అంతా చదువుకున్నవారే! అందరికీ కావల్సిందొకటే— ఉద్యోగం, ఇస్త్రీబట్టలు నలగని ఉద్యోగం... కాయకష్టం అవసరంలేని ఉద్యోగం. బుద్ధిబలంతో నిమిత్తంలేని ఉద్యోగం, మనిషిలోని బద్ధకాన్నీ, బాధ్యతారాహిత్యాన్నీ పెంచే ఉద్యోగం! అందుకోసం ఏళ్ళ తరబడి ఆఫీసుల చూట్టూరా ప్రదక్షిణాలుచేస్తూ వస్తులుండటానికైనా వెనుదీయటం లేదు. కానీ ఒళ్ళు వంచి తిరిగీ వృత్తి విద్యలో దిగటానికి నామోషీ!

ఇన్ని మార్పులు దేశంలో ఏర్పడటం అలావుంచి, రాఘవులుకు అతగాడి మేనమామకూతురు రాజ్యంతో పెళ్ళి జరిగిపోవటమూ, ఏడాది తిరక్కుండా సుబ్బులు పుట్టటమూ జరిగిపోయాయి ! స్కూలుఫైనలు పరీక్షలో కుస్తీపడుతుండగానే....మరోపిల్లాడు....ఇక చదువు ఒంటబట్టదని తేల్చుకొనే

సరికి మరోపిల్ల.... ఇక బస్తీలో నేకాపురంపెట్టి.... ఎలాగోలా ఉద్యోగం తెచ్చుకోవాలనే స్థిరనిర్ణయాని కొచ్చేసరికి మరో పిల్లాడు....

"ఇట్లా ఎన్నాళ్ళు గడుస్తుంది. నేనూ అత్తతో సజ్జ కోతకో, వరి నాటుకో వెళ్తాను. నువ్వూ కుండల మన్ను ఎన్నిక చెయ్యటం.... కంపకొట్టుకు రావటం చెయ్యి. వచ్చి నప్పుడు ఉద్యోగం వస్తుంది. అత్తా, మామలకు తేలిగ్గా వుంటుంది" అంది రాజ్యం.

రాఘవులుకు "ఇన్‌సల్ట్" అనిపించిందా సలహా. రాజ్యంచెంప ఛెళ్ళుమని పించాడు.

రాజ్యానికి, సంపాదించి పెట్టిలేని భర్త బడాయి చూస్తుంటే మంట రేగింది! అసలే చెంప మండిపోతూవుంది. ఆ మంట కాస్త పైకి గప్పుమంది. "మడేలన్నదీ ఉద్యోగమే. మన కుమ్మరిపనీ ఉద్యోగమే. నువ్వెప్పుడో వెలగ బెడతా నంటున్నదీ ఉద్యోగమే. అంతా పొట్టకూటికోసమే గానీ....రాజ్యాలేలడానికా్కదే! కూటికోసం కూలి చేసుకుంటే తప్పా? మరికాస్త హోదాఅయిన కూలీ ఉద్యోగం నీకా్క వాలి....అదొచ్చేటప్పటికి....మనకి మరో ముగ్గురు పిల్లలు పుడతారు....అందరికీ తలో మూకుడయినా చేసిపెట్టుమంటాను మామను....అడుక్కు తినటానకి....."

రాజ్యాన్ని చావబాది నోరు మూయించాడు. రాత్రికి రాత్రే పెళ్ళినాడు మామ చదివించిన వాచీ, ఉంగరం,

సుబ్బులుచేతికి బిగుత్తై పెట్లో దాచివుంచిన మురుగులూ కోమటి దగ్గర కుదువపెట్టి రైలెక్కాడు

అంతక్రితమే ఇక్కడ కొలువు కుదిరిన పోలిరెడ్డి చాలా టిప్‌టాప్‌గా కనిపించాడు

"ఎందుకురా రాఘవులూ లేనిపోనిబాధ! ఉద్యోగాల కోసం పెద్దపెద్ద డిగ్రీలవాళ్ళే కాళ్ళరిగి పోయేలా తిరుగుతున్నారు మనకెవరిస్తారు? ఓ మాంఛి ఉద్యోగం చూచుకున్నాన్నేను! ఆటే శ్రమ లేదు. భలే మజాగా వుంటుంది కూడా. నాలాగే నీకూ దండైన కండలున్నాయి....ఇది గవర్నమెంటు "జాబు" కాదనుకో! నమ్మకంగా చేస్తే కావలసినంత జీతం కారు మంచి బట్టలు తిన్నంత తిండి మాంచి ఫారిన్ సీసాలుకూడా రుచి చూడొచ్చు అప్పుడప్పుడూ?"

పోలిరెడ్డి చూపిన స్వర్గం రాఘవులుకు క్షణకాలం వూపిరి సలప నివ్వలేదు.

"దర్జాగా బ్రతకటానికి గవర్నమెంటు జాబే కావాలా ఏమిటి పదపద నేనూ చేరుతాను" అన్నాడు సంతోషంగా.

రాజారావుని చూచిన మరుక్షణంలో షాక్ తిన్నట్లయ్యాడు రాఘవులు వెన్ను చరిచాడు పోలిరెడ్డి. ఇతగాడు రాజిగాడు—ఊహూఁ రాజారావు. మొదట్లో మనలానే వీధులు కొలిచాడు. ఈలోగా ఈ జబ్బొచ్చిందట—ఎట్లాగో జబ్బు ఇక పెరక్కుండా మందులు తీసుకున్నాడు. వాడి పక్క

నున్నా, మనకేం ప్రమాదం లేదు....చురుకైనబుర్ర....
అందమైన అమ్మాయిల్ని పోగువేసి....మూడేళ్ళలో ఈ పెద్ద మేడ కొన్నాడు. రెండు కార్లు కొన్నాడు....స్వంతానికి ఓ బంగళా, రంభలాటి భార్యా....ఏర్పరచుకున్నాడు....

మనల్ని నెలకోసారి టూర్లకు పంపిస్తాడు....మనలాటి వాళ్ళు చాలామంది వస్తాదులున్నారులే ఇతగాడి చేతికింద....విజయవాడ, హైదరాబాదు, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు....ఒకటేమిటి....తడవకోవేపు పంపిస్తాడు....లేచొచ్చిన రకాలు, దిక్కులేని రకాలూ....మనం వెతికిపోల్చుకుని.... తేవాలి....ఒక్కోసారి మంచి అమ్మాయిలు....స్కూళ్ళకూ, కాలేజీలకూ వెళ్ళేవాళ్ళను....ఒంటరిగా చిక్కుకున్నపుడు....లేదా దారి తప్పించీ, కాస్త నదురుగా వుండే పనిపిల్లలు....ఏ మార్కెటుకో....సినిమాకో వచ్చినపుడు మాటేసి....అమాయకంగా వుండే పది పన్నెండేళ్ళ అమ్మాయిలు....ఇలా మన బుద్ధిబలం కొద్దీ పట్టుకురావాలి.... తెచ్చిన సరుకు ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి తెలియనివ్వడు రాజారావు....అతగాడికి పెద్ద పెద్ద వాళ్ళతో స్నేహాలు పలుకుబడి వున్నాయి....అంచేత మనకి ఏ భయమూ ఉండదు.... తెచ్చిన సరకు నాణ్యతను బట్టి మంచి ఇనాములు కూడా ఇస్తుంటాడు....కాస్త మొండి ఘటాలను మనలాటి వాళ్ళకు అప్పగిస్తాడు....నాలుగు తగిలిస్తే వాళ్ళే దారికి వస్తారు!"

పోలిరెడ్డి చెప్పేదంతా గొడవగాతోచింది రాఘవులుకు. మనసుకు సరి పోలేదు....కానీ పోలిరెడ్డి ఒంటిమీద మెరుస్తున్న

ఖరీదైన సూటూ, మిరుమిట్లు గొలిపే వాచీ, పెద్ద, సన్నని పాము కుబుసంలాటి పర్సులో పైకి కనిపిస్తున్న నోట్లూ, అతగాడి ఇంగితాన్ని అణగ ద్రొక్కేసింది....

"రాజ్యానికి తెలిస్తే ? నాన్నకూ, అమ్మకూ తెలిస్తే........మరెవరికైనా తెలిస్తే ?........" సందేహాలు గొంతుకకు అడ్డుపడ్డాయి.

త్రికాలజ్ఞునిలా నవ్వాడు పోలిరెడ్డి....“ఎవరికీ తెలియనవసరంలేదీ ఉద్యోగ వివరాలు ! పిప్పా కంపెనీలో ఉద్యోగమంటే చాలు....ఎలాగూ నైట్ డ్యూటీయే ఎక్కువ కాబట్టి, భార్యా బిడ్డలూ, తలి దండ్రులూ ఆట్టే ఆరా తీసే అవకాశం వుండదు. స్మగుల్డు వాచీలూ, రేడియోలు కావలసినన్ని. డబ్బు దండిగా సంపాదించే మొగుణ్ణి, మగాణ్ణి అదెలా వస్తోందని ఏ భార్యా, మరెవ్వరూ ప్రశ్నించరు. డబ్బు సంపాదించటం చేతకాని మొగుణ్ణి, ఉద్యోగంలేనివాణ్ణి పెళ్ళాం బిడ్డలేకాదు తలిదండ్రులు కూడా ఈసడించుకుంటారు. ఆపైన నీ ఇష్టం!” రాఘవులుకు తక్కున రాజ్యం మాటలు గుర్తుకొచ్చాయి; “తలకో మూకుడైనా చేసి పెట్టమంటాను మామను, అడుక్కుతినటానికి....!”

'అహం' తన్నుకు వచ్చింది. మరుక్షణం....ఇక వేరే ఆలోచన లేకుండా ఆ ఉద్యోగంలో చేరిపోయాడు.

హంటర్ ఝుళిపించే ప్రతిక్షణంలో.... అవతలమ్మాయి భయ విహ్వలతలో తన మగసిరికి పొంగిపోయేవాడు.దొంగ

తనంగా లాక్కువచ్చిన అమ్మాయిలు గోడుగోడున ఏడుస్తూ గింజుకుంటూంటే.... వాళ్ళని లొంగతియ్యటం "సవాల్" గా స్వీకరించేవాడు. రాజారావు చాలా మెచ్చుకుంటుంటాడందుకే. జీతమూ బాగా పెంచాడు.

ఈ పదేళ్ళలో రాఘవులు బాగా బలిశాడు.... రాజ్యం: పిల్లలు హాయిగా వున్నారు. రాజ్యం తన భర్త ప్రయోజకత్వాన్ని గురించీ, తమ సుఖజీవనాన్ని గురించీ....గొప్పగా తన పుట్టినింటా, మెట్టినింటా చెప్పుకుంటుంది. అప్పుడప్పుడూ పదో పాతికో తల్లిదండ్రులకు పంపుతుంటాడు. ఆమధ్య ఓ రేడియో కూడా పంపించాడు తండ్రికి. తల్లి తండ్రి మురిసిపోయారు. తన ఇంట ....తమ వంశంలో.... ఈ మట్టిలో ఇంతటి అవతారపురుషుడూ, మాణిక్యం ఉద్భవించటం కేవలం తమ పూర్వ జన్మ సుకృతంగా భావించారు.

చాలాసార్లు రాజ్యం అడిగింది. "మీరు ఉద్యోగంచేసే కంపెనీ చూడాలనుంది....చూపించరూ ?"

"నువ్వొద్దులే అక్కడికి. అక్కడంతా దొరలు....తాగుతారు....నీలాటి అందగత్తె రావటం మంచిది కాదు...."అంటూ తప్పించుకున్నాడు. రాజ్యం బుర్రలో 'అందగత్తె' అన్న మాటతప్ప మరేమీ నిలబడలేదు.

"సుబ్బులు పెద్దదవుతోంది. పెళ్ళిచేద్దాం!" అంది ఆ మధ్య రాజ్యం ఓసారి.

రాఘవులు విరగబడి నవ్వాడు. "నీ పెళ్ళి బంగారం

గానూ ! దాన్ని బాగా చదివించి పంతులమ్మను చేద్దాం. మన వాళ్ళలో ఎవరూ ఇంత చదువు చదవ లేదని పిద్దాం...." అన్నాడు; చక్కగా కను ముక్కు తీరు, మలిచినట్లున్న కూతురి కేసి వాత్సల్యంగా చూస్తూ....

ఇంతసాఫీగా హాయిగా జరుగిపోతున్న జీవితంలో.... వారం రోజుల క్రితం ఈ సంఘటన జరిగింది.

"సుబ్బులీరోజు స్కూలునుంచి రాలేదు...." అంది రాజ్యం, నైట్ డ్యూటీకి తయారవుతున్న రాఘవులతో.

"స్కూల్లో ఏదైనా ప్రోగ్రామ్స్ వున్నా యేమో !" ఇంగ్లీషు కూడా ఘుమాకుగా మాట్లాడటం నేర్చుకున్నాడు, దొరల పుణ్యమా అని....

మర్నాడు ఉదయం పదిగంటలకు' ఇంటికొచ్చేసరికి రాజ్యం గాభరాగా ఎదురొచ్చింది. "రాత్రంతా రాలేదుపిల్ల. దాని స్నేహితురాళ్ళందరకీ చెప్పి పంపాను.... తెలీదన్నారు. అసలు నిన్న వాళ్ళస్కూలు మామూలు వేళకి విడిచి పెట్టారట !"

రాఘవులు ఆలోచనలో పడ్డాడు.

ఒకవేళ....అది ప్రేమలోగాని పడలేదు గదా ? తన గొడవలో తనుండి పిల్లవయసును గుర్తించలేక పోయాడేమో? ఏ కుర్రాడితో నేనా, ఎక్కడి కేనా....

ఆ ఊహే శరీరాన్ని జలదరింప జేసింది క్షణకాలం....

మౌనంగా బయటికినడిచి....అక్కడక్కడా వాకబూచేశాడు, అలాటిదేం ఆచూకీ దొరకలేదు....

ఇక ఎక్కడికి వెళ్ళినట్లు ? ఎలా వెళ్ళినట్లు....

కొంపదీసి........రాజారావు కంపెనీలాటి వాళ్ళెవరేనా పిల్లని....? ఇక ఆలోచించ లేకపోయాడు....

ఓ వేపు రాజ్యం గాబరాపడి, బెంగపెట్టుకుంది....

తన భయాలు తనవి. అవి రాజ్యానికి కూడా తను చెప్పుకోలేడు....ఇన్నేళ్ళుగా....తను విషపు తిండి తినిపించి నందుకు....రాజ్యం క్షమించదు సరిగదా, పిల్లల్ని ఏ గంగలోనో తోసి, తనూదూకి చస్తుంది !

ఇన్నేళ్ళ సుఖమూ, ఆనందమూ ఎగిరిపోయాయి ! ఎవరికీ మనసు విప్పి చెప్పుకోలేని బాధా, భయమూ చిత్రవధ చేయసాగాయి....

తన చేతులతో లాక్కువచ్చిన అమ్మాయిలు....దారి తప్పించినఅమ్మాయిలు....గిలగిలలాడినఅమ్మాయిలు....చావు దెబ్బలుతిన్న అమ్మాయిలు....ఒక్కొక్కరుగా....కళ్ళముందు కనిపించసాగారు. ఆ అమ్మాయిల ప్రక్కనే సుబ్బులు.... అమాయకంగా....ఏడుస్తూ....దెబ్బలు తింటూ....ఎంతకోత ? ఎంత భరింపరానివేదన....

* * *

"రాఘవులూ ! నువ్వెక్కడున్నావా ? ఆ కొత్త పిల్లని కారులో తీసికెళతా నన్నావటగా ?"

ST. JOSEPH'S GIRLS HIGH SCHOOL, GUNTUR

ఖంగుమన్న ప్రశ్నతో రాఘవులు ఆగిపోయాడు.... అత్తగాడి ఆలోచనలు తిరిగిపోయాయి ఎక్కడివక్కడ. వర్తమానం వెనుభూతంలా నిల్చింది ఎదురుగా.

చలపతి చిరునవ్వుతో చూస్తున్నాడు. "మతిగాని పోయిందా రాఘవులూ ?"

"లేదు.... లేదు పద వస్తున్నా !" అప్పుడుగానీ తెలిసి రాలేదు రాఘవులుకు. గానుగెద్దులా తిరిగిన వీధులే తిరిగాడు. తప్ప, ఎక్కువదూరం నడవలేదు....సుబ్బులు కనిపించలేదు...

కారు స్టార్టు చేస్తూ పక్కకు చూశాడు రాఘవులు ఆ అమ్మాయి ఏడుస్తూ కూర్చుని వుంది. 'నిన్ను ఈ నరకం లోకి త్రోయను....కనీసం నిన్నయినా రక్షిస్తే, నా బిడ్డ నాకు దొరుకుతుందేమో ?' అనుకున్నాడు రాఘవులు....ఆక్షణంలో నిజమైన తండ్రి, నిజమైన మనిషి అత..డిలో చోటు చేసుకున్నాడు....

"నేనూ రానా ?" అంది దుర్గవ్వ.

"ఒద్దులే."

సిటీబార్డర్స్ దాటి వచ్చింది కారు. ఆ పాడు రోడ్డు వారగా...."దిగు...."

భయంతో బిగుసుకు పోయి వుందా అమ్మాయి.

"దిగి వెళ్ళు.... ఆ రోడ్డంట బస్సులు వస్తాయి.... దేన్లోనో ఎక్కి వెళ్ళిపో....మీ ఇంటికి చేరుకో....ఇదుగో

ఖర్చులకు గానూ....దగ్గరుంచుకో....త్వరగా వెళ్ళు....మరె ప్పుడూ అలాటి నరకాలలో, యమకింకరులను నమ్మి అడుగు పెట్టకు....”ఓ విధంగా కంపించిపోతూ ఆ నాలుగు ముక్కలూ అన్నాడు....జేబులోంచి డబ్బు తీసిచ్చాడు....నమ్మలేనట్లు చూచిందా అమ్మాయి....క్షణకాలం....మరుక్షణంలో కాళ్ళకు చుట్టుకుని భోరున ఏడ్చింది.... “నీ మేలు జన్మలో మరచి పోలేను....నా తండ్రిలా నన్ను రక్షించావు....అంతేచాలు.” అప్రయత్నంగా అతగాడిచెయ్యి ఆ మెతలనిమిరింది....“వెళ్ళు.... త్వరగా వెళ్ళిపో....దూరానబస్సు వస్తోంది....పో....”అన్నాడు తేరుకుంటూ.

వెనక్కి తిరిగిచూస్తూ.....కృతజ్ఞతలు కురిపిస్తూ.... కలలో మనిషిలా పరుగెత్తిందా అమ్మాయి....మరో ఐదు నిమిషాలలో, ఆ అమ్మాయి ఎక్కిన బస్సు రోడ్డుమీద దూసుకు పోయింది....

కారు రివర్స్ చేసుకున్నాడు రాఘవులు. రాజారావు, దుర్గవ్వ తనని అనుమానిస్తారేమో? అనుమానించనీ....అంతగా అయితే ఉద్యోగం పోతుంది....అంతేగా? ఈ విషంలో తనిక బ్రతకలేడు. ఈ పాములాటి బ్రతుకు తనిక బ్రతకలేడు. తన సుబ్బులు దొరికితే అంతేచాలు.

రాజారావు కళ్ళు అగ్నిగోళాల్లా రాఘవులు కేసి చూశాయి—“చెట్టంత మనిషివి! నీనుంచి పిట్టలాటి పిల్ల పారి పోయిందంటే నమ్మశక్యం కావటంలేదు రాఘవులూ....అంత మతిమరుపుగా వున్నవాడివి....ఆ పిల్లనెందుకు బయటకు తీసి

కెళ్ళావు? అసలిలాటివిషయాలలో....అంతఆర్ద్రితపనికిరాదు.... మీా పిల్ల కనిపించలేదు....సెంటిమెంటల్‌గా నువ్వు జాలి తలచావేమో ననిపిస్తోంది. మన భార్యాబిడ్డల్ని వీళ్ళలో వూహించుకోనడం మొదలుపెడితే....ఇకమనం బ్రతికి బట్ట కట్టినట్లే ! ఊఁ ఇక మీాదట ఇలాటి పనులకు—విషంమింగి, విషం జీర్ణించుకొనే మనుషుల్నే పెడతాను....వెళ్లు....ఎంత నష్టం....ఛీ....ఛీ....! కానీలే....ఎందాకా పెరుగెడుతుంది ?" రాజారావు చివరిమాటలు ఒళ్లు ఝల్లుమనిపించాయి!', రాఘవులుకు.

పదిహేను రోజులు శలవు పెట్టాడు. వూరూ, వాడా, వూరూరూ గాలించాడు. సుబ్బులు జాడలేదు. మతిపోయిన ట్లుంది రాఘవులుకు.

"నా జీవితం నన్నే కాటేసింది !" అనుకున్నాడులోలో పల ఏడుస్తూ.

"ఈ ఉద్యోగానికి శలవు రాసేస్తాను రాజ్యం ! ఈ ఉద్యోగం నాకొద్దు !" అన్నాడారోజు....శలవు అయిపోయిన రోజు, బండబారిన రాజ్యం—త్రుళ్ళి పడ్డట్లు చూచింది. భర్త వాలకం ఆమెకు అర్థంకాలేదు.

"ఒద్దొద్దు : మనం చేసుకొన్న-ఏ జన్మలో పాపంకొద్దో మనబిడ్డమనకుదక్క-లేదు....ఆయుష్షు బాగుంటే,అదేవస్తుంది.... మీారీ వుద్యోగం మానొద్దు. వెనక మగ వెధవలున్నారు.... వాళ్ళూ మీాలాగే చదువుకోవద్దూ ? పెద్ద ఉద్యోగం

సంపాదించుకోవద్దూ ? పోయిందాని కోసం ఉన్న ఉద్యోగం వదిలిపెట్టుకొని ఆ వెనుక వీధులెంట పడదామా. ఆ పని చెయ్యొద్దు."

రాఘవులు అవాక్కుగా కూర్చుండి పోయాడు! నిజమే ఈ నాడు తనకు దొరికే ఉద్యోగ మేముంది ? సుఖంగా బ్రతకటానికి అలవాటుపడిన తన కుటుంబం.... తిరిగి దారిద్ర్యాన్ని ఎదుర్కొనే స్థితిలో లేదు ! రాజ్యానికీనాడు తను చేసే ఉద్యోగం వివరాలు చెప్పినా ఆమె పైకి "ఛీ....ఛీ...." అంటుందేమో గానీ....సిద్ధాంతాల పేరుతో ఉద్యోగం వదులుకోమని మాత్రం చెప్పదు....

"మీరు ఉద్యోగం వదులుకోకండి!" మరోమారు హెచ్చరించింది రాజ్యం....

రాఘవులు నిస్సత్తువుగా లేచాడు.

* * *

ఆరు నెలలు గిర్రున తిరిగాయి.

ఆ రోజు.... అదే గది.... అదే తెర.... రాజారావు గర్జనలాంటి పిలుపు.... రాఘవులు లేచి వెళ్ళాడు....

"రా! రా! రాఘవులూ....భూమి గుండ్రంగా ఉంటుందని నువ్వూ, నేనూ అంతా చదువుకున్నాం....అది ప్రత్యక్షంగా చూపిస్తాను నేను ఇప్పుడు. గ్లోబు కాదులే...." రాజారావు వికృతంగా నవ్వుతూ ఆగాడు.... రాఘవులు కేమీ అర్థం కాలేదు....ఇప్పుడతగాడి శరీరం మాత్రమే బ్రతికి వుంది.

డబ్బు సంపాదిస్తోంది.... చెప్పిన పనులు చేస్తోంది. మనస్సు ఏనాడో చచ్చిపోయింది.

"పారిపోయిన.... ఊహూఁ నువ్వు ఎగరవేసిన చిలకను.... తరిమితరిమి.... తిరిగి పట్టి తెచ్చాడు పోలిరెడ్డి.... కానీ ఆ నాటి ఆచిలక వేరు... ఈచిలక వేరు.... పో.... చూడు పో...." రాజారావు తెర కేసి చెయ్యిచూపుతూ అన్నాడు.

"దుర్గవ్వా !నువ్వూ' నేనూ, కాస్సేపలా బయటకు వెళదాం రా! రాఘవులు ప్రపంచజ్ఞానం నేర్చుకుంటాను" అన్నాడు తిరిగి. దుర్గవ్వ, రాజారావు గది బయటకు నడిచారు.

రాఘవులు యాంత్రికంగా తెర వెనక్కు వెళ్ళాడు. ఆ అమ్మాయి....! ఆనాడు పారిపోవటానికి తను సాయం చేసిన అమ్మాయి! చూడగానే నిర్ఘాంత పోయాడు రాఘవులు.... ఈసారి ఆ పిల్ల ఏడవటంలేదు.... బాగా అలంకరించుకుని వుంది. హుషారుగా పచార్లు చేస్తోంది.... "నువ్వు.... నువ్వు.... మళ్ళీ ఈ నరకంలోకి? ఈ విషంలోకి....?" రాఘవులు కోటిప్రశ్నల చూపుతో తడబడిపోతూ అడిగాడు....

ఆ అమ్మాయి నవ్వింది.... కాస్త ఒళ్లు చేసింది....

"అవును.... వచ్చాను. ఈ మారు నా అంత నేనుగానే వచ్చాను!"

రాఘవులు మెరుపుకొట్టిన మనిషిలా చూస్తూండి పోయాడు.

"ఆ రోజు....మీరలా పంపగానే.... వెళ్ళాను.... కానీ అమ్మానాన్నా....ఆదరించరని నాకూ తెలుసు! నా డిగ్రీనాకు ఉద్యోగం ఇచ్చింది కానీ....ఎక్కడైనా ఇదేతంతు....దిక్కులేని దాన్నని తెలిశాక....ప్రతి ఒక్కరికీ నామీదే కన్ను! ఓ విషవలయంలో చిక్కుకున్నాను...పెద్దపెద్ద ఘరానా యువకులూ... కొందరు ఆఫీసర్లూ....ఓసారి ఒంటరిగా నన్ను.... నాప్రాణాలు దక్కించుకోలే ననుకున్నాను. ఆ సమయంలో పోలిరెడ్డి.... కాపాడకపోతే నేనిలాబ్రతికివుండే దాన్నికాదు....విశాలప్రపంచంలో కంటే, ఇక్కడే క్షేమం అనిపించింది నాకు! పోలిరెడ్డి వెంటవచ్చాను....ఇది విషం అని నాకు తెలుసు! విషంలో బ్రతికే క్రిముల్లానే బ్రతుకుతాను"....ఆ అమ్మాయి నవ్వింది....

"ఇవిగో పూలు.... పాలు...." దుర్గవ్వ లోపలికి వచ్చింది....ఆ అమ్మాయి ఆ విషంలాటి పాలు.... గడగడ త్రాగింది....తల్లో పాముల్లాటి పూలు పెట్టుకుంది.... రాఘవులు గిరుక్కున తిరిగి గది బయటకు వచ్చాడు....

అతగాడి చెవుల్లో ఆ అమ్మాయి మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి.... "విషంలో బ్రతికే క్రిముల్లాగానే బ్రతుకుతాను...." అవును తను మాత్రం ?

("తరుణ" ఫిబ్రవరి 72)